www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 5 జనవరి 2023

5

అన్నమయ్య



జిఒ జారీ అప్రజాస్వామికం

ప్రజాశక్తి - రాయచోటి

ర్యాలీలు, రోడ్ షోలు, సభలు, సమావేశాలకు అనుమతి నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్. అల్లాబకాష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యలపైన ప్రశ్నించే గొంతులను, ప్రజా ఉద్యమాలను అణగ దొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 1ని తీసుకొచ్చిందని చెప్పారు. ప్రతిపక్షాల విమర్శను తట్టుకోలేని జగన్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. జీవోను రద్దు చేయకపోతే అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. **బి.కొత్తకోట :** జిఒ 1ని రద్దు చేయాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సలీంబాషా, మండల అధ్యక్షులు అష్రప్ ఆలీ, గంగులప్ప, బాలకృష్ణ, రామచంద్ర, మనోహర్, కృష్ణప్ప, హబీబ్, మోదీన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్‌విఆర్ కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తామన్నారు. కొన్ని చిన్న చిన్న సాంకేతిక కారణాలవల్ల పింఛన్లు రానివారు ఆయా సచివాలయాలలో దరఖాస్తు చేసుకున్నట్లయితే వారి దరఖాస్తును పరిశీలించి పింఛన్లు ఇస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 7020 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా మీ ఇళ్ల దగ్గరకే డాక్టర్లు వచ్చి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని సిఎం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది పింఛన్ పెంపుదల చేశారన్నారు. మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనోజారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి ఒక్క మహిళ యోగక్షేమాలు చూస్తూ జగనన్న పాలన కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. 879 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింక చలపతి, జడ్‌పిటిసి ఉదయ్ కుమార్, ఆర్‌డిఒ మురళి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎంపిడిఒ తాజ్ మజురుద్, వివిధ శాఖల అధికారులు, పింఛనుదారులు పాల్గొన్నారు.

కామన్ స్కూల్ విధానం అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి

సావిత్రి బాయి పూలే ఆశయమైన సమాజంలో సమాన విద్యావకాశాల కోసం కామన్ స్కూల్ విధానాన్ని తీసుకు రావాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ పేర్కొన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ సమాజం నిర్మించాలంటే ప్రజలందరికి సమానంగా విద్యనందించాలనీ కోరారు. నేటి పాలకులు ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీన పరచి, ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్లడం విచారకరమని వాపోయారు. అందులో భాగమే నూతన జాతీయ విద్యా విధానమని తెలిపారు. దేశంలో రెండు కోట్ల మంది బడి ఈడు కల్గిన బాలబాలికలు ఇప్పటికీ బడి ముఖం చూడలేదని సర్వేలు చెబుతున్నాయి అన్నారు. మన రాష్ట్రంలో కూడా 2లక్షల మంది విద్యార్థులు గడచిన సంవత్సర కాలంలో డ్రాప్‌అవుట్ అయ్యారని పేర్కొన్నారు. ఇలా డ్రాప్ అవుట్ అయ్యే వారిలో 70 శాతం మంది బాలికలే ఉండటం, ఈరోజు బాలికల చదువు, అభివృద్ధి, సంక్షేమం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు.

సావిత్రబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపాల్ నాయక్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనరు సురేంద్రరెడ్డి, వివిధ మండలాల నాయకులు ప్రసాద్, కిఫాయత్, రఫీఖ్, ఆదిల్, రఖీబ్, అమీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాదిరి ప్రశ్నపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు పీలేరు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలను పంపిణీ చేశారు. బుధవారం స్థానిక అయ్యప్పరెడ్డి కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదిరి ప్రశ్నాపత్రాలను సంబంధిత సబ్జెక్ట్ టీచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్.శివారెడ్డి మాట్లాడుతూ విద్యార్తుల భవిష్యత్తుకు 10వ తరగతి పునాది అని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల బంగారు భవిత కోసం ఉచిత మాదిరి ప్రశ్నాపత్రాలను పుస్తక రూపంలో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థులకు అందించామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ వీటిని పంపిణీ చేశామని చెప్పారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత యుటిఎఫ్ ఈ మెటీరియల్ తయారు చేయించిందని, ఇంకా అవసరం మేరకు తక్కువ ధరతో ఇతర విద్యార్థులకూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ మునిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, సుధాకర్, మండల కోశాధికారి పి.మస్తాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.జయమ్మ, బోధనా సిబ్బంది, విద్యాలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన జయరామ నాయుడు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును బెంగళూరు ఎయిర్‌పోర్టులో మదనపల్లి నియోజకవర్గం టిడిపి నాయకులు శ్రీరామినేని జయరామ నాయుడు కలిశారు. రెండు రోజుల కుప్పం పర్యటన నిమిత్తం వస్తున్న ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జయరామ నాయుడు మాట్లాడుతూ అధినేత చంద్రబాబుకు స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు పర్యటనకు మదనపల్లె నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి విజయవంతం చేస్తామన్నారు.

యువశక్తి సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువశక్తి సభను విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్ డాక్టర్ మైఫోర్స్ మహేష్ పిలుపునిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలో యువశక్తి సభకు విస్తృత ప్రచారం కల్పించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రచార రథం సత్యసాయి జిల్లా కదిరిలో ప్రారంభమై సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో యువశక్తి సభపై ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. యువశక్తి సభకు పెద్ద సంఖ్యలో యువత తరలి రావాలని కోరారు. సమావేశంలో జనసేన చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అమరనారాయణ, వీర మహిళలు మల్లిక, శోభ, రోజా, జనసైనికులు రమణారెడ్డి, హర్ష, సోను, నాగేంద్ర జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

మాట్లాడుతున్న సుబ్బరాజు

ఐపిటి ఫలితాల్లో 'రాజు' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాయచోటి

జాతీయ స్థాయిలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫ్యసీ టీచర్స్ (ఐపిటి) నిర్వహించిన నేషనల్ స్టాండెడ్ పరీక్షలు జూనియర్ సైన్స్ పరీక్షలు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు రాజు విద్యా సంస్థల ఫౌండర్ చమ్మర్తి సుబ్బరాజు తెలిపారు. బుధవారం స్థానిక రాజు స్కూల్‌లో అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ నవంబర్ 27వ తేదీన నిర్వహించిన నేషనల్ స్టాండెడ్ పరీక్షలు జూనియర్ సైన్స్ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 80 వేలకుపైగా విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన ఫలితాలు వెలువడగా 171 మంది అర్హత సాధించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది ఎంపికైతే రాజు పాఠశాలకు చెందిన విద్యార్థులు 20 మంది ఉన్నారని పేర్కొన్నారు. 8వ తరగతికి చెందిన దుశాంతరెడ్డి, అయన్, భువన శ్రీ, 9వ తరగతికి చెందిన కె.చంద్రిక, సి.భార్గవి, 10వ తరగతికి చెందిన షేక్ జ్ఞానేశ్వర్, జాహ్నవి, విజయ్ కుమార్, సాయి రిత్విక్ వర్మ, అస్సార్ హుస్సేన్, నిరంజన్, లోకేశ్వరి, భాగ్యలక్ష్మి, భవిష్య, శ్రీకీర్తి, రెడ్డి వెంకట సాయి, శశాంక్ రెడ్డి, భార్గవ్ ఎంపికయ్యారన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. ఉపాధ్యాయులను, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తేక్వాండో టీమ్ మేనేజర్‌గా విజయభాస్కర్

రాజంపేట అర్బన్: అమృత్‌సర్‌లో జరుగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయి మహిళా తేక్వాండో పోటీలకు యోగి వేమన యూనివర్సిటీ తరపున టీమ్ మేనేజర్‌గా రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మేజర్ సి.విజయభాస్కర్ ఎంపికయ్యారు. ఈ పోటీలు అమృత్‌సర్‌లోని జిఎన్‌డి యూనివర్సిటీలో జనవరి 9 నుండి 12 తేదీ వరకు జరుగనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ బి.పురుషోత్తం తెలియజేశారు. ఇదే యూనివర్సిటీ తరపున ఇద్దరు విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. టీమ్ మేనేజర్‌గా ఎంపికైన మేజర్ సి.విజయభాస్కర్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తమ్ అభినందనలు తెలియజేశారు. వీరు ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సి.విజయ భాస్కర్ ఎంపిక పట్ల కళాశాల అధ్యాపక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రాయచోటి బరిలో 'ద్వారక'?

- టికెట్ కేటాయిస్తే సానుకూలత
- పోటీపై టిడిపి నేతల సంప్రదింపులు
- ఏడాదిగా వైసిపికి దూరంగా...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయచోటి రాజకీయం రసవత్తరంగా మారనుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపి అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి విజయానికి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి తన వంతు కృషి చేసిన సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యే వ్యతిరేకతను ఎదురొడ్డి నిలిచి గెలుపొందడానికి సహకరించిన ద్వారకనాథరెడ్డిని మూడున్నరేళ్లుగా అధికార వైసిపి తీవ్ర నిరాదరణకు గురిచేసిన విషయం తెలిసిందే. ఏడాది క్రితం కార్పొరేషన్ పదవుల పందేరంలోనూ ఆయన సేవలను విస్మరించింది. ఆర్టీసీ చైర్మన్ పదవి ఇస్తామని చివరి వరకు ఊరించిన అధికార వైసిపి రిక్తహస్తాన్ని చూపించిన సంగతి తెలిసిందే. దీనికి ఆయన ఖిన్నుడై ఏడాదిపాటు అధికార పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. ఈనేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల సం దడి రాజుకోవడంతో ఆశావహుల ఆశలకు రెక్కలొచ్చిన సంగతి తెలి సిందే. ఈనేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది.

టిడిపి తరుపున ముగ్గురు?!

ప్రతిపక్ష టిడిపి తరుపున మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి తీవ్ర పోటీ వాతావ రణం నెలకొన్న నేపథ్యంలో ద్వార కనాథరెడ్డి రంగంలోకి వచ్చినట్లు వార్తలు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. ద్వారకనాథరెడ్డికి టికెట్ కేటాయిస్తే రాయచోటి రాజకీయ ముఖచిత్రం ప్రభావితమయ్యే అవకాశం ఉందనే సానుకూల వాదన వినిపిస్తోంది. టిడిపి టికెట్ గండాన్ని అధిగమించిన అనంతరం ఎన్నికల సమరంలో మిగిలిన ముగ్గురిలో ఎవరు ఏమేరకు సహకరిస్తారనే అంశం ఫజిల్‌గా మారనుంది. ఇప్పటికే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పెద్దఎత్తున ఆశలు పెంచుకున్న సంగతి తెలిసిందే. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆర్.రమేష్‌రెడ్డి పోటీలో ఉండనే ఉన్నారు. ఈయన తోపాటు ప్రసాద్‌బాబు టికెట్ కేటాయిస్తే పోటీ చేయడానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

సర్వేల ఆధారంగానే టికెట్లు?!

టిడిపి టికెట్ కేటాయింపుల అంశంలో రాజీపడే ప్రసక్తే లేదని అధిష్టానం పేర్కొంటోంది. ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ టికెట్లను ఖరారు చేయడంలో భాగంగా ఇప్పటికే ఐదు, ఆరు రకాల సర్వే సంస్థలను రంగంలోకి దించిన సంగతి తెలిసిందే. సర్వే సంస్థలు అందించే నివేదిక ఆధారంగా కేటాయించే అవకాశాలు ఉన్నాయని సీనియర్ నేతలు ఊదర గొడుతున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రాయచోటి టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబుతోపాటు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారంలో ఉన్న గడికోట ద్వారకనాథరెడ్డి రంగంలోకి దిగిన నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

టిడిపి నేతల సంప్రదింపులు!

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబంలో వచ్చిన విభేదాలను సద్వినియోగం చేసుకునేపనిలో టిడిపి నిమగ్నమైంది. ప్రతిపక్ష టిడిపి నేత మాజీ ఎమ్మెల్యే ఒకరు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో నీకు టికెట్ వస్తే నేను చేస్తానని, నాకు టికెట్ వస్తే మీరు చేయాలనే' పేరుతో సంప్రదింపులకు దిగినట్లు సమాచారం. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గడికోట కుటుంబం కలిసికట్టుగా బరిలోకి దిగడం, రెండవసారి వైసిపి అధినేత వైఎస్ జగన్ ప్రచారానికి రావడం, మైనార్టీ నాయకుని ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ నిచ్చిన నేపథ్యంలో అధికార వైసిపి జయకేతనం ఎగరవేసిన సంగతి తెలిసిందే. గడికోట కటుంబంలోని విభేదాలను మరింత పెరిగేందుకు అవసరమైన ఆజ్యం పోసే ఎత్తుగడలకు దిగినట్లు తెలుస్తోంది.

పశువైద్య ఆస్పత్రుల్లో జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని రామాపురం, నీలకంఠరావుపేట, గువ్వలచెరువు పశువైద్య ఆస్పత్రులను బుధవారం అన్నమయ్య జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. నీలకంఠరావుపేట పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువులకు సంబంధించి వైఎస్ఆర్ బీమాలో కొద్దిపాటి మార్పులు ప్రభుత్వం చేసిందని చెప్పారు. జగనన్న పాల నిల్వ భవన నిర్మాణాలను పరిశీలించామన్నారు. అన్నమయ్య జిల్లాలోని రామాపురం, నూలివీడు, బురకాయలపేట, సిద్ధవరం గ్రామాల్లో ఐదు పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పాల కేంద్రం నిర్మాణాల కోసం ఒక్కొక్కరికి రూ1.90 లక్షలతో భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పశువులకు జబ్బులకు మందుల కొరత ఉండదన్నారు. ఇప్పటికే మందులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మేకలకు, గొర్రెలకు సంబంధించి సామాజిక నత్తల నివారణ మందులు అందజేశామని తెలిపారు. కిసాన్ క్రెడిట్‌కార్డు ఉన్న పాడి లబ్ధిదారులకు బ్యాంకు నుంచి రూ.1.60 లక్షల రుణం మంజూరు చేస్తామని చెప్పారు. పశు గ్రాసం కింద రైతులకు 75 శాతం సబ్సిడీతో 370 టన్నులు గడ్డి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఆయన వెంట పశు వైద్య అధికారులు ప్రవీణ్ కుమార్, సరోజ కీర్తన, విష్ణువర్ధన్ రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న జెడి గుణశేఖర్ పిళ్లై

కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి: పట్టణ పరిధిలోని ఐ.కె.పాఠశాలలో యూత్ ఐకాన్ ఆర్గనైజర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్-2023 పోస్టర్‌ను డిఇఒ వై.రాఘవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యూత్ ఐకాన్‌ను డిఇఒ అభినందించారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో ఒలంపియాడ్ పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 6281453550లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐ.కె పాఠశాల కరెస్పాండెంట్ ఇషాక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ నూతన సంఘం ఏర్పాటు

రాయచోటి: జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు అందరూ కలిసి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల నూతన సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా కె.నవీన్ కుమార్ రెడ్డి సెక్రటరీగా, కె. రమేష్ బాబురావు, కోశాధికారిగా బి.వెంకట్ మోహన్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, ఉప కార్యదర్శిగా కె.వి.రమణకుమార్, గౌరవ అధ్యక్షులుగా జి.రమేష్ బాబు, గౌరవ సలహాదారులుగా రమణ కుమార్, శ్రీలత, ఇసి సభ్యులుగా ఆరుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల ఉన్నతికి కృషి చేస్తూ, రైతులకి మరిన్ని సేవలు అందించే విధంగా కృషి చేస్తామని సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ జిల్లాలోని వ్యవసాయ అధికారులు పాల్గొన్నరు.

నూనత కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సిబ్బంది

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

'మార్చి నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె టిడ్కో ఇళ్లకు యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించి మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక తిరుపతిరోడ్డు, వెంకప్పకోట నందు నిర్మిస్తున్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంత పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం టిడ్కో ఇళ్లను అందజేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. టిడ్కోలో రోడ్డు పనులు, డ్రెయినేజీ, విద్యుత్తు, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు. ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని పూర్తి చేయాలి వంటి వివరాలను టిడ్కో ఇఇని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరగా పూర్తిచేయాలని మార్చి కల్లా సర్వాంగ సుందరంగా టిడ్కో గృహాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మురళి, ఎపి టిడ్కో డిప్యూటీ ఇఇ బలరామయ్య, ఎఇ షాహిర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషేధిం చామని, అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అన్నారు. బుధవారం ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడానికి వీలుగా ఉండే ప్రాంతాల దగ్గర్లోనే ఎక్కువ నేరాలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. అలాంటి ప్రాంతాలను ఆయా పరిధిలోని పోలీసు అధికారులు పంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో కలిసి చెత్తను, చెట్లను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించడానికి వీలుగా ఉండే ప్రాంతాలలో పోలీసు గస్తీ, పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు కానీ, డయల్ 100కు కానీ సమాచారం అందించాలన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ప్రత్యామ్నాయ భూమి కేటాయించాలి : గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ప్రత్యామ్నాయ భూమి కేటాయింపు త్వరగా చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అటవీ శాఖతోపాటు ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట ఎస్టీలకు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న అటవీ భూమిని, చిట్వేలి మండలంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమి 99 ఎకరాలను వ్యవసాయ సాగులో భాగంగా అటవీశాఖకు కేటాయించాలని సూచించారు. సుండుపల్లి - రాజంపేట అటవీ మార్గంలో ప్రస్తుతం ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డుకు అదనంగా వెడల్పు కోసం సేకరిస్తున్న అటవీ భూమి బదులు 39 ఎకరాలు ప్రభుత్వ భూమిని చిట్వేలి మండలంలో అటవీశాఖకు అప్పచెప్పాలని అధికారులను ఆదేశించారు. రాజంపేట పరిధిలోని ఏకిరిపల్లి, బిగడపల్లి, చింతలకోనలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు గుర్తించిన ప్రదేశంలో ఫారెస్ట్ ల్యాండ్ ఇవ్వాలని సూచించారు. ఇచ్చిన ఫారెస్ట్ ల్యాండ్‌కు బదులుగా ప్రభుత్వ భూమిని ఇస్తారని చెప్పారు. రాజంపేటలో నగరవరం ఏర్పాటుకు 35 హెక్టార్లు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వం అప్పగించిందని ఆ పనుల వెంటనే మొదలుపెట్టాలని అధికారులను సూచించారు. ఇంకా అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ పరిధిలో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించాలని చెప్పారు. సమీక్షలో డిఆర్ఓ సత్యనారాయణ, రాజంపేట, రాయచోటి ఆర్‌డిఒలు కోదండరామిరెడ్డి, రంగస్వామి, డివిజనల్ ఫారెస్ట్ అధికారి నాగమనేశ్వరి, రాయచోటి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్లు రాంబాబు, ప్రమీల, డిపిఒ ధనలక్ష్మి, భూ సేకరణ విభాగపు సూపరింటెండెంట్ నాగభూషణ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, ఆర్‌అండ్‌బి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీదేవి

బియ్యం కార్డులు, పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -కలకడ

నూతనంగా మంజూరైన బియ్యం కార్డులు పింఛన్లను ఎంపిపి శ్రీదేవి రవికుమార్ చేతుల మీదుగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం, మెనిఫెస్టోలో చెప్పిన ప్రకారం పింఛన్లను రూ.2500 నుంచి 2750 రూపాయలకు పెంచారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అర్హత ఉంటే చాలు పార్టీలకతీతంగా, వివక్షతకు తావు లేకుండా, ఎంతో పారదర్శకంగా, కుల మత బేధాలు లేకుండా పెన్షన్ అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.నారాయణ, పార్టీ కన్వినర్ కమలాకర్‌రెడ్డి, కలకడ సర్పంచ్ సావత్‌అలీ ఖాన్, ఎంపిటిసి ముబారక్, సెక్రటరీ నందిని, కదిరాయచెరువు ఇంచార్జి కిషోర్, వెల్ఫేర్ రామాంజనేయులు, జనార్ధన్ నాయుడు, ఉదయ్ భాస్కర్, జగన్‌మోహన్, నాగరాజా, బయన్న చిన్నప్పనాయుడు, రెడ్డప్ప, ఇనయతుల్లా, జిలానీ, వాలంరటీర్లు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా అర్హులైన ప్రతి అవ్వాతాతలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సామాజిక భద్రత కల్పిస్తున్నారని జడ్పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 218 పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బికే ఛైర్మెన్ నీళ్లభాస్కర్, ఎంపిటిసి రాజేష్, వైసిపి నాయకులు రాయుడు, రఘు, వెంకటేష్, ఆనంద, పాల్గొన్నారు**చిన్నమండెం :** మండలంలోని పెన్షన్లను రూ.2,500 నుంచి రూ.2,750 పెంచడం ఎంతో ఆనందించాల్సిన విషయని మండల ప్రజా పరిషత్ అధికారి దివ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యంగా జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, పంచా యతీ కార్యదర్శులు, సంక్షేమకార్యదర్శులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఘనంగా ఎంఎస్‌పి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భవించి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదో సంవత్సరంలోకి అడుగుపెట్టిన మహాజన సోషలిస్ట్ పార్టీని మందకృష్ణ మాదిగ స్థాపించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం బి.కొత్తకోట జ్యోతి చౌక్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నియోజక ఇన్ ఛార్జ్ దుమ్ము చిన్నమాట్లాడుతూ రాబోయే భవిష్యత్తు కాలంలో ఎంఎస్‌పి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను కలుపుకొని రాజ్యాధికారం వారితో సామాజిక న్యాయం ఆర్థికన్యాయం సమానత్వాన్ని చూసే పార్టీ ఏదన్నా ఉందంటే అది ఎంఎస్‌పి మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఈశ్వరప్ప, నాయకులు భవాని వెంకటేష్, పలకరవి, చౌడప్ప, గట్టు రమణ, దేవరాజుపల్లి శంకరబాలు, గంగన్న, గంగులప్ప, ఉత్తన్న, రామకృష్ణ ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆర్‌కె రఘు, వంశీ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండల కేంద్రంలోని హరిత సర్కిల్లో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దళితుల అభివృద్ధితో పాటు ఎస్‌సి వర్గీకరణ కోసం అలుపు పెరుగని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటప్ప, మల్లికార్జున, భాస్కర్, గోపిదిన్నె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. **పీలేరు:** పంచాయతీ మిట్టపై ఎంఎస్‌పి 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంఆర్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సద్దల ప్రేమ్ కుమార్ మాదిగ, నాయకులు తిమ్మయ్య, ప్రసాద్, శివకుమార్, శ్రీనివాసులు, కుమార్, రెడ్డి, మైనార్టీ నాయకుడు వెల్డింగ్ బాష, బిసి నాయకుడు చల్లా శ్రీరాములు, సాయి, నవీన్, జనార్ధన్, రెడ్డీస్ యాదవ్, రాకేష్, హేమంత్, గంగాధర్, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

డివైడర్లపై చెత్త.. కార్మికులకు భారం

ప్రజాశక్తి-గాలివీడు

డివైడర్‌పై ఉన్న చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

పట్టణంలో బస్టాండ్ నుంచి పావని హోల్ సర్కిల్ వరకు వున్న డివైడర్‌పై చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలు వేసి పారిశుధ్య కార్మికులపై మరింత బారం మోపుతున్నారు. ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు కాలువలు, రోడ్లు , వీధులలోని సిసిరోడ్లను శుభ్రం చేసి ఆ చెత్తనంతా ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తుంటారు. అయితే కొందరు నిర్లక్ష్యంగా ఇంటిలోని చెత్తా, చెదారం వ్యర్థ పదార్థాలను ఎదరుగా డివైడర్‌పై వేయడంతో పారిశుధ్య కార్మికులతో పాటు వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ప్రతిరోజూ ఐదు ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలిస్తుంటారు. స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను డివైడర్‌పై వేయకుండా పంచాయతీ నిర్దేశించిన విధంగా పంచాయతీ ట్రాక్టర్లలో వేసి కార్మికులకు సహకరించాలని పలువురు కోరుతున్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కలకడ

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా ఉన్నతమైనదని సెల్ ఫోన్లకు విద్యార్థులు లోను కాకుండా ట్యాబ్‌లను ఉపయోగించుకుని విద్యను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం పొంది ఉన్నతమైన చదువులు చదవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశయమని అన్నారు. పేద విద్యార్థులకు కార్పోరేట్ విద్యాప్రమాణాలను సిఎం అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకొని ఉన్నత చదువులకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, సింగల్‌విండోఛైర్మన్ కమలాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు .

సిహెచ్‌సి డాక్టర్‌గా మణిభూషణ్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక తంబళ్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన డాక్టర్ గా బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె మొదటిసారిగా ఉద్యోగంలో చేరారు. ఆస్పత్రిలో ఈమె చేరికతో ఐదు మంది డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మణిభూషణ్ మాట్లాడుతూ ఎన్‌బిఎస్‌యులో భాగంగా పురిటి బిడ్డల సంరక్షణలో సకాలంలో వైద్య సూచనలతో పాటు వైద్య చికిత్సలు అందిస్తానని పేర్కొన్నారు. శిశు మరణాలను అరికట్టేందుకు తన వంతు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

యానాదుల ఉద్యోగుల సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు : కలెక్టర్

ప్రజాశక్తి-కురబలకోట

జగనన్న గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరిష

నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. బుధవారం కురబలకోట మండలం, కడప క్రాస్ లేఅవుట్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోజురోజుకు పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. కడప క్రాస్ లేఅవుట్ నందు మొత్తం 162 ఇల్లు మంజూరయ్యాయని ఇవన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు లబ్ధిదారులను అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు. ఇళ్లన్నీ పూర్తయితే రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి అయ్యేటట్లు చూడాలని సూచించారు. పేదల ఇళ్ల నిర్మాణాల ప్రగతి సాధనలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో తహ శీల్దార్ భీమేశ్వర్ రావు , ఎంపిపి దస్తగిరి, ఎంపిడిఒ దిలీప్, సర్పంచ్ సుభాషిని శ్రీనివాసులు, హౌసింగ్ ఎఇ , లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

అటెండర్‌ను సన్మానిస్తున్న తహశీల్దార్ నరసింహకుమార్

ప్రజాశక్తి- పుల్లంపేట

పుల్లంపేట మండల తహశీల్దార్ కార్యాలయంలో అధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డి అధ్యక్షతన లూయి బ్రెయిలీకి ఘనంగా నివాళులు అర్పించారు. తహశీల్దార్ నరసింహకుమార్ చేతులమీదుగా అంధుడు అటెండర్ షేక్ సరాజ్ ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భముగా తహశీల్దార్ మాట్లాడుతూ అంధుల జీవితాలలో వెలుగును నింపిన మహా యోగ్యుడు లూయీ బ్రెయిల్ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో లెక్చరర్ అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు వాహిద్, సంఘ సభ్యుడు మురళీ, పిచ్చయ్య పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంధులకు బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను పట్టణంలోని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఇఒ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ అంధుల విద్యాభివృద్ధి కోసం వారికి అనువుగా ఉండే లిపిని తయారు చేశారని, అదే లూయిస్ బ్రెయిలీ లిపిగా ప్రాచుర్యం పొందిందని అన్నారు. ఈ లిపిపై పట్టు సాధించిన అంధులు, వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు అంజాద్‌అలీఖాన్, టీచర్ సురేష్ ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా తంబళ్ళపల్లి భవిత సెంటర్ లో లూయిస్ బ్రెయిలీ, జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, ఐఇఆర్‌టి టీచర్ అనూరాధ, సిఆర్‌పి సుధాకర్, కేర్‌గివర్ గంగరత్నమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్ గిరీషను సన్మానిస్తున్న ఎఫ్‌పిఒలు

రైతు ఉత్పత్తిదారుల సంస్థతో ఆర్థిక పరిపుష్టి

- కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో ఆర్థిక పరిపుష్టి జరుగుతుందని అమూల్ డైరీ లాగా జిల్లాలో కూడా రైతు ఉత్పత్తి సంఘాలు అభివృద్ధి కావాలని రైతుల సమగ్ర అభివృద్ధికి ఎఫ్‌పిఒలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జిల్లా పైలెట్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించబడింది. ఈ సమావేశంలో జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ ద్వారా నిధులు కేటాయించబడే ఎపిఐ ఎల్‌ఐపి ప్రాజెక్టు ద్వారా రైతులకు ఆదాయాన్ని పెంపొందించే విధంగా చేపట్టబడిన వివిధ పైలెట్ ప్రాజెక్టుల గురించి చర్చించారు. సమావేశానికి రైతు ఉత్పత్తి సంఘం సిద్దేశ్వర రైతుసంఘం నిమ్మనపల్లి రైతుఉత్పత్తి సంఘం మర్యాద రామన్న రైతుఉత్పత్తి సంఘాలకు సంబంధించిన ప్రెసిడెంట్లు, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న మామిడి టమాటా తదితర ఫుడ్ ప్రాసెసింగ్‌ల గురించి రైతు ఉత్పత్తి సంఘాలతో చర్చిం చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆదాయాన్ని పెంచుకోవడానికి ఫుడ్ ప్రాసెసింగ్ అనేది చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మన జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా టమాటా మామిడి తదితర వాటిని ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారామంచి ఉత్పత్తులుగా మార్చడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పెద్దపెద్ద ఇంటర్నేషనల్ కంపెనీలతో రైతులు ఒప్పందాలు కుదుర్చుకొని ఆదాయాన్ని రెట్టింపు లేదా మూడురెట్లు పైగా సంపాదించవచ్చని అన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌ని పెంపొందించి రాష్ట్రంలోనే జిల్లా రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశిం చారు. మొదటిసారిగా కలెక్టర్ ఎఫ్‌పిఒ లతో సమావేశమైన సందర్భంగా ఆయ నను శాలువాతో సన్మానించారు. సమావేశానికి జిల్లా హార్టికల్చర్ అధికారి రవి చంద్ర, హార్టికల్చర్ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పుల్లంపేట

పంచాయతీ పరిధిలోని ఉడుమువారిపల్లె గ్రామం అరుంధతివాడ హరిజనవాడ గ్రామాలలో బుధవారం స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణతో పాటు చెత్తను తొలగించి, వీధులలో బ్లీచింగ్ పౌడర్ చల్లించామని తెలిపారు. శీతాకాలం కావడం చేత నెమ్ము వాతావరణ పరిస్థితులు ఉండ డం వలన ఈగలు, దోమలు అధికమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నం దువలన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ నిర్మించాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అను గుణంగా పారిశుధ్యం పైన ప్రధాన దృష్టి సారించినట్లు తెలిపారు.

కమ్యూనికేషన్ టెక్నాలజీపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-కురబలకోట

విద్యార్థులు కమ్యూనికేషన్ టెక్నాలజీపై పట్టు సాధించాలని మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ సి.యువరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిట్స్ కళాశాల బిటెక్ మూడవ సంవత్సరము ఇసిఇ చదువుతున్న విద్యార్థులు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు లోని ఐటిఐ ఇండస్ట్రీ ను సందర్శించినట్లు తెలిపారు. ఐటిఐ లిమిటెడ్ లోని టెలి కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో గల అంశాలను విద్యార్థులు తెలుసుకున్నారని ఆయన అన్నారు. భారత దేశంలోని కేంద్రాలు బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ముంబై, న్యూఢిల్లీ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 17 ఇతర ప్రదేశాలలో ఉన్నాయని తెలిపారు. కంపెనీ గిగాబిట్ పాసివ్ ఆప్టికల్ నెట్‌వర్క్ , మేనేజ్డ్ లీజ్డ్ లైన్ నెట్‌వర్క్ ఉత్పత్తులు, స్టాండ్ అలోన్ సిగ్నలింగ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ యాక్సెస్ పాయింట్, రేడియో మోడెమ్,సెట్ వంటి ఉత్పాదక ఉత్పత్తులతో సహా విభిన్న ఉత్పత్తులను అక్కడ సిబందితో అడిగి తెలుసుకున్నారని అన్నారు.

ఎఐటిఎస్ ప్రొఫెసర్‌కు 24వ పేటెంట్

ప్రజాశక్తి - రాజంపేట

అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ దొమ్మరాజు కృష్ణమోహన్ రాజు ఎక్కువ బరువులను (10 నుంచి 100 టన్నులు) ఎత్తే యంత్రం బరువు దాని ధర ఒకటిబైనాలుగు వంతుకు తగ్గించే విధానంపై పరిశోధన చేసినందుకుగాను 24వ పేటెంట్ అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దొమ్మరాజు కృష్ణమోహన్ రాజు మాట్లాడుతూ తాను మల్టీపుల్ వార్మ్ అండ్ వార్మ్ వీల్ మెకానిజం ఫర్ లిఫ్టింగ్ హై లోడ్స్ (పేటెంట్ నెంబరు. 41398) అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ పేటెంట్ ను అందుకోవడం జరిగిందని తెలిపారు. కృష్ణమోహన్ రాజు 24వ పేటెంట్ ను సాధించినందును కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ఛైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌ఎంవి నారాయణ, డీన్స్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

చంద్రబాబును అడ్డుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ కస్తూరివిశ్వనాద నాయుడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గపు చర్యని తెలిపారు. రోడ్డుషోలు నిర్వహించకూడదని జిఒలు తేవడం ప్రజా హక్కులను కాలరాయడమేనని అన్నారు. రాష్ట్రంలోని ప్రజలు వైసిపి పాలనలో సంతోషంగా లేరని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలపై దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వ ఇలాంటి కుట్రలకు పాల్పడుతుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ప్రజలు చంద్రబాబుకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆర్.కె.సుధాకర్, ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఎన్నారై కువైట్ ప్రధాన కార్యదర్శి మారోతి మల్లి, క్లస్టర్ ఇంచార్జి జగదీశ్వర్ రెడ్డి, తెలుగు మహిళా అధ్యక్షురాలు మహిళా అధ్యక్షురాలు హస్తి సుప్రజ, కస్తూరి శ్రీధర్. దుద్యాల జయ చంద్ర, పుల్లేల రమేష్, కొండపల్లి మల్లి చుండు ఈశ్వర్,పోతినేని భరత్, గుండపనేనిసతీష్, నాగినేని రాంప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల వేళను మార్చొద్దు

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి ఆర్‌టిసి డిపో ఏర్పడినప్పటి నుంచి గాలివీడు నైట్ సర్వీస్ బస్సు కొన సాగుతూ ఉండేది. కదిరి-రాయచోటి నుండి రాత్రి 9.30 గంటలకు రాయిచోటిలో బయలుదేరి గాలివీడుకు వచ్చి , గాలివీడు నైట్ హల్ట్ ఉండి, ఉదయం 4.30 నిమిషాలకు రాయచోటికి వెళ్ళేది. ఈ సమయం తిరుపతి, చెన్నై, బెంగళూరు, కడప ఆఫీసులకు, హాస్పిటల్‌కు వెళ్లే వారికి ఎంతో అనుకూలంగా ఉండేది. ఆర్‌టిసి అధికారులు రాత్రి 9:30కు పోవాల్సిన బస్ సర్వీసులు 9గంటలకు పంపించి తెల్లవారుజామున 5.30 గంటలకు బస్సును పంపించే ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పాత వేళల్లోనే బస్సు సర్వీసును నడపాలని కోరుతున్నారు.

ఎఒగా రాజకుమారి

ప్రజాశక్తి-రామాపురం

రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న గుజ్జుల రాజకుమారి మండల వ్యవసాయాధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజంపేట మండలానికి ఎఒగా తనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు అందాయని తెలిపారు. 2011 జులైలో వల్లూరు వ్యవసాయ కార్యాలయంలో ఎఇఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టానని చెప్పారు. గతసంవత్సరం అక్టోబర్‌లో రామాపురానికి బదిలీ అయ్యానని పేర్కొన్నారు.

ఇదేంఖర్మ కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి

భరోసా కల్పించడమే టిడిపి ధ్యేయం : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజలకు భరోసా కల్పించడమే టిడిపి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కొత్తపల్లె 4వ వార్డులో టిడిపి నాయకులతో కలిసి ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి మొత్తం 10 అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడడంతో నాయకులు ముఖం సాటేస్తున్నారని ఆరోపించారు. 'బాదుడే బాదుడు 'రాష్ట్రానికి ఇదేం కర్మ, కార్యక్రమాల ద్వారా తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి దూసుకు పోతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ రాబోయే రోజుల్లో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యల్ని కష్టాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించడం తాము చేస్తున్న కార్యక్రమం అని అన్నారు. ప్రజలకు ఎదురవుతున్న ప్రధానమైన సమస్యల్ని తెలుసు కొని అవగాహన కల్పించి వాటిపై చర్చ జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు పడుతున్న అవస్థల్ని బయటపెట్టి వారిని చైతన్యపరిచి, ప్రభుత్వాన్ని ప్రజాకోర్టులో నిలబెట్టడం ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వల్లి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ ఎస్‌కె హుస్సేన్ ,పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, మాజీ కౌన్సలర్ మహెబూబ్ బాష, సోనిరాజ్ కలిమ్, కొట్టే చలపతి, టిడిపి నాయకులు షేషి జాబిర్, అత్తర్ జావిద్ , సాయి, మహమ్మద్ జాఫర్ ఫయాజ్ బాడీబిల్డర్,శివారెడ్డి, గంగయ్య, దిలీప్ రాజు, సయ్యద్, వెంకట్రామిరెడ్డి, షబ్బీర్ ఆహ్మద్, అలీ, టిడిపిపాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భవ్య

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 86 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు ప్రియాంక, భవ్య తెలిపారు. కార్యక్రమంలో ఇఒ ఉదయ్‌కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'చమర్తి'

రాజంపేట అర్బన్ : టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్‌రాజు తనదైన శైలిలో మరోసారి మానవత్వం చాటుకున్నారు. బుధవారం పాలెం సమీపంలో హరే రామ ప్రస్తుత చెందిన వాహనం బోల్తాపడి పలువురు భక్తులు గాయాల పాలయ్యారు. అదే దారిలో వెళ్తున్న చమర్తి జగన్మోహన్ రాజు ప్రమాదాన్ని గ్రహించి హరే రామ బాధితులను తన సొంత వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకొని క్షత గాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని బాధితులకు అన్ని విధాల అండగా ఉంటానని భరోసా కల్పించారు.

సిఐని సన్మానించిన ఎంపిపి

కలకడ : మండల కేంద్రమైన కలకడ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర ను ఎంపిపి శ్రీదేవి రవికుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిఐని పూలమాలవేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, శాంతి భద్రతలపై దృష్టి సారించాలని తెలిపారు. ఇందుకోసం మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బి.కొత్తకోట

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పిటిఎం మండలం కమ్మచెరువు సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతులను అధికారులతో చర్చించి అక్కడక్కడే పరిష్కరించారు. మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడం జరిగిందని, ఇంకా ఎక్కడైనా అభివృద్ధి పనులు మిగిలిపోయి ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి మొహమ్మద్, ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి, వైసిపి జిల్లాప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా గ్రామసచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి : సిఐ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మొలకలచెరువు సర్కిల్ పరిధిలో తంబళ్లపల్లె పెద్దమండ్యం, మొలకలచెరువు, పెద్దతిప్ప సముద్రం, పోలీస్‌స్టేషన్లో పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేసి నేరాలు అదుపుకు కృషి చేయాలని సిఐ సాదిక్ అలీ ఎస్ఐలకు ఆదేశించారు. బుధవారం తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్లో వారి నేరాలు నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, తదితర అంశాలపై ఆరా తీశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అల్లర్లు చేసే వారిపై దృష్టి పెట్టి నియంత్రిం చాల న్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. సమా వేశంలో ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, వెంకటేష్, మధురామచంద్రుడు, ఎఎస్ఐ గోపాల్ పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లలకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గర్భిణులు, చిన్న పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లావ్యాధి నిరోధక టీకాఅధికారి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. బుధవారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలకు వంద శాతం ఇమ్మినైజేషన్ చేయించాలని తెలిపారు. చిన్నపిల్లలకు వచ్చే సైడ్ ఎఫెక్ట్ గురించి తెలియజేసి వాటిని ఎలా ఎదుర్కొనాలో వారికి తెలియజెప్పాలని అన్నారు. టీకా కార్డును భద్రంగా ఉంచుకొని తరువాతి సందర్శనకు వచ్చేటప్పుడు కార్డు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దయ్య, సిహెచ్ఒ నారాయణ ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కదిరాయచెరువు పంచాయతీ బొంతలవారిపల్లి సమీపంలో ఉన్న పెద్ద వంక వద్ద పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు.ఈ దాడులలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి రూ. 6600 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. దాడులలో సిబ్బంది శ్రీనివాసులు, ఖలీల్, రాజేంద్ర ,సహదేవ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- బి.కొత్తకోట

చోరికి గురైన హుండీని పరిశీలిస్తున్న ఎస్ఐ

పట్టణ సమీపంలోని కట్టమీద గంగమ్మ ఆలయంలో కొందరు దుండగులు చోరీకి పాల్పడ్డారు. పూజారి టి.ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో కొందరు దుండగులు ఆలయంలో ప్రవేశించి అమ్మవారి ముక్కుపుడక, కళ్లు (వెండివి) తోపాటు హుండీ లోని రూ.15వేలు నగదును ఆపహరించుకుని వెళ్లారన్నారు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.